
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 29 సెప్టెంబర్ 2023
5
తిరుపతి



వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌కు నివాళి

తిరుపతి డెస్క్: ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ (98)కి సిఐటియు తిరుపతి జిల్లా కమిటీ నివాళి అర్పించింది. గర్వించదగిన వ్యవసాయ, జన్యు శాస్త్రవేత్తని అన్నారు. బ్రిటిష్ పాలనలో బెంగాల్‌లో చూసిన ఆకలి చావులకు ఆయన చలించిపోయారని, వైద్య విద్య అధ్యయనాన్ని ఆపివేసి వ్యవసాయ, జన్యు శాస్త్రవేత్త అయి దేశంలోని ఆహార సమస్యను తీర్చాలని వ్యవసాయ శాస్త్రాన్ని అధ్యయనం చేశారన్నారు. వరి, గోధుమ అధిక ఉత్పత్తికి అనేక జన్యు వంగడాలను పరిశోధనతో సష్టించారు. దేశంలో వ్యవసాయ రంగంలో అధిక ఉత్పత్తులు సాధించడానికి విశేష కషి చేశారు. రైతుల ఆత్మహత్యలు నివారించడానికి ఆయన అనేక విలువైన సూచనలు అందించారన్నారు. గిట్టుబాటు ధరలను నిర్ణయించి ప్రభుత్వాలు అమలు చేయాలని సిఫార్సు చేశారు.



ఫైల్‌ఫొటో

'స్వాతి' ముత్యం

ఎస్ఐ నుంచి డిప్యూటీ కలెక్టర్‌గా
ఘనంగా సన్మానం, వీడ్కోలు



స్వాతిని సత్కరిస్తున్న ఎస్‌పి

పోలీసు విభాగంలో 'స్వాతి'ముత్యంగా నిలిచి, డిప్యూటీ కలెక్టర్ స్థాయికి చేరుకుంది. గురువారం స్వయానా ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి ఆమెను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. 2018 బ్యాచ్ ఎస్ఐగా తిరుపతి జిల్లా పోలీసు శాఖలో స్వాతి నియమితులయ్యారు. కఠోరశ్రమతో ఇటీవల గ్రూప్ 1 ఉద్యోగ నియామకాల్లో రాష్ట్రంలోనే ఎనిమిదో ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగాన్ని సాధించారు.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సత్యసాయి జిల్లా హిందూపరం గురవనహళ్లి గ్రామ వాస్తవ్యులు. నాగరాజు, రత్నమ్మ దంపతులకు స్వాతి 1993లో జన్మించారు. బాల్యం నుంచి విద్యతో చురుగ్గా ఉంటూ ఎంఎస్‌సి కెమిస్ట్రీ ఎస్వీ యూనివర్సిటీలో పూర్తి చేశారు. అనంతరం ఎస్ఐ నియామక పరీక్షల్లో ఉత్తీర్ణులై 2017లో ఎస్ఐ ఉద్యోగాన్ని సాధించి ట్రైనింగ్‌కు వెళ్లారు. 2018, జులై 3న ఎస్ఐ ట్రైనింగ్ పూర్తి చేసుకుని తిరుపతి అర్బన్ పోలీసు జిల్లాలోని తిరుచానూరు పోలీసు స్టేషన్‌లో ప్రొబేషనరీ ఎస్ఐగా స్వాతి నియమితులయ్యారు. తర్వాత గాజులమండ్యం పోలీసు స్టేషన్‌లోనూ, శ్రీకాళహస్తి టుటౌన్‌లోనూ, జిల్లా ఎస్‌బిలో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. 2021లో ఒంగోలుకు చెందిన మహేష్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను వివాహమాడారు. భర్త ప్రోత్సాహంతో ఒకటిన్నర సంవత్సరం లీవు తీసుకుని హైదరాబాద్‌లోని ప్రముఖ అకాడమీలో కోచింగ్ తీసుకుని 2022 సంవత్సరంలో వచ్చిన గ్రూప్ 1 నోటిఫికేషన్ ద్వారా తన ఆశయ సాధనే లక్ష్యంగా నిబద్ధత, పట్టుదల, కఠోరశ్రమతో అహర్నిశలు కష్టపడి చదివి గ్రూప్ వన్ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్వ్యూలు పూర్తి చేసి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. స్వాతి మాట్లాడుతూ పోలీసు విభాగం తన పుట్టిల్లుతో సమానమన్నారు. పోలీసు శాఖలో పనిచేసిన అనుభవం వల్లనే ఎలాంటి బెరుకు లేకుండా ధైర్యంగా, కచ్చితత్వంతో సమాధానాలు చెప్పగలిగానని చెప్పారు. డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగాన్ని సాధించేందుకు పోలీసు శాఖ అనుభవం ఎంతో ఉపయోగపడిందన్నారు.

ఈ సన్మాన కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, పరిపాలన కులశేఖర్, శాంతిభద్రత విమల కుమారి, నేర విభాగం డీఎస్పీలు గిరిధర, ఎస్బి సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి


యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిపిఎస్ ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

ఒపిఎస్‌ను పునరుద్ధరించి, జిపిఎస్‌ను రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి అన్నారు. యుటిఎఫ్ కార్యాలయంలో జిపిఎస్ ప్రతులను తగలబెట్టి నిరసన తెలిపారు. పాదయాత్ర సందర్భంగా ప్రతిపక్ష హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు భద్రత లేని జిపిఎస్ విధానాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదన్నారు. సిపిఎస్ కన్నా జిపిఎస్ ప్రమాదకరమని అన్నారు. ఒపిఎస్ పునరుద్ధరణకు రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామన్నారు. ఒపిఎస్ సాధించేంత వరకూ అలుపెరగని పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి దండు రామచంద్రయ్య, నాయకులు పద్మజ, సురేంద్ర, మురళి, హేమాద్రిబాబు, మురళీకృష్ణ, సురేష్, రాజు పాల్గొన్నారు.



జిపిఎస్ ప్రతులను దగ్ధం చేస్తూ...



ఆదిశంకరలో హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఆదిశంకరలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ సక్సెస్

ప్రజాశక్తి - గూడూరు టౌన్


ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ -2023 కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారని కళాశాల డైరెక్టర్ విజయకుమార్ తెలిపారు తెలిపారు . భారతదేశ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆల్ ఇండియా టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆఫ్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ -2023 కార్యక్రమాన్ని చేపట్టింది . ఈ క్రమంలో ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిరవధికంగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ -2023 నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ -2023 కార్యక్రమం ద్వారా విద్యార్థుల నుండి 35 ఉపాయాలను సేకరించి కేంద్ర ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందని తెలిపారు . వారి ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వెంకటగిరి జాతరలో విఐపి పాస్‌లు బంద్

నిర్వహణకు 27 మందితో కమిటీ

ప్రజాశక్తి - వెంకటగిరి

వచ్చే నెల 4,5 తేదీల్లో జరగబోవు శ్రీపోలేరమ్మ జాతర నిర్వహణ కమిటి మొదటి సమావేశాన్ని గురువారం నేదురుమల్లి నివాసంలో ఏర్పాటు చేశారు. ఈసమావేశానికి అన్ని రంగాల ముఖ్య వ్యక్తులను ఒక కమిటిగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గ సమన్వకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో మరింతగా జాతరకు గుర్తింపు వచ్చినట్లు పలువురు పేర్కొన్నారు. ఈ జాతర ప్రజల జాతరగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల జాతరగా జరగాలనే ఉద్దేశంతో 27మందితో అన్నీ రంగాల ముఖ్య వ్యక్తులతో నూతన కమిటిని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈకమిటి సమిష్టి నిర్ణయాలతో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల జాతరగా ప్రశాంతగా నిర్వహిస్తామన్నారు. వెంకటగిరి సంస్థానదీశులు మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర సలహాలు, సూచనలు, సంప్రదింపులతో సాంప్రదాయ బద్దంగా జాతరను నిర్వహణ సాగుతుందన్నారు. గతంలో విఐపి పాసుల పేరుతో భక్తులకు అసౌకర్యం కలగేదన్నారు. ఈసంవత్సరం విఐపి పాసులను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు తీర్మానించారు. ఈ విఐపి పాసుల కారణంగా సామాన్య భక్తులకు అమ్మవారిని దర్శించుకోవడం ఆలస్యం అయ్యేదన్నారు. ఉచిత దర్శనాలు ప్రశాంతంగా జరిగేందుకు ఈనిర్ణయం తీసుకున్నామన్నారు. ఊరేగింపు రోజు అమ్మవారని ట్రాక్టరులో కాకుండా గతంలో రథంపై ఊరేగింపు సాగే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారు. పట్టణ ప్రజలకు ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి విషయము కమిటి ముందుంచి సమస్యలు లేకుండా చూసుకుంటామన్నారు. అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పట్టణ కన్వీనర్ ఢీల్లిబాబు మాట్లాడుతూ విఐపి పాసుల ఎత్తివేయడం మంచి నిర్ణయమని ఈనిర్ణయముతో సామాన్యులకు అసౌకర్యం కలగకుండా ఉంటుదన్నారు. ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతర పోలీస్ జాతరగా కాకుండా ప్రజల జాతరగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకమిటిలో సిపిఎం వెంకటగిరి ఏరియా ఆర్గనైజర్ వడ్డిపల్లి చెంగయ్య, డాక్టర్ కళాధర్, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి నెమ్మళ్లపూడి సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సమాజాన్ని మేల్కొల్పిన దార్శనికులు జాషువా

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్/ గూడూరు టౌన్

సమాజంలోని అసమానతలపై తన కలంతో రచనల ద్వారా దురాచారాలను ప్రశ్నించి ఆలోచింపజేసిన దార్శనికులు, కవి గుర్రం జాషువా అని విశ్రాంత ఆచార్యులు గార్లపాటి దామోదర నాయుడు కొనియాడారు. గురువారం గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడలోగల ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జాషువా సంస్మరణ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గాయకుడు బొందు రామచంద్రారెడ్డి, అవధాని ఆముదాల మురళి, గుడిమెట్ల చెన్నయ్యలు మాట్లాడుతూ వివక్షకు గురవుతూ అణచివేయబడుతున్న ప్రజల ఆత్మగౌరవం కోసం తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపిన నవయుగ కవి చక్రవర్తి జాషువా అన్నారు. పుస్తక సంపాదకులు మన్నవ గంగాధర ప్రసాద్ సమీక్ష చేస్తూ జనని పిలుపు మేరకు మూడు రాష్ట్రాల నుంచి 46 మంది కవులు, రచయితలు జాషువా సాహిత్యంపై పలు అంశాలపై వారి వారి శైలిలో ఆణిముత్యాలు లాంటి కవితలను, పద్యాలను అక్షరీకరించారని జాషువాపైన సంపాదకత్వంలో పుస్తకం తీసుకురావడం గర్వంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, కవులు, రచయితలు కలువగుంట రామమూర్తి, టెంకాయల దామోదరం పాల్గొన్నారు.



అరసం ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ

శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో ప్రజా కవి కళా ప్రపూర్ణ కవి సామ్రాట్ గుర్రం జాషువా 128వ జయంతి ఉత్సవాలను ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ ఆధ్వర్యంలో కళాశాల సమావేశం మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేద ప్రజల పక్షపాతి అయిన కవి సామ్రాట్ గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ మాట్లాడుతూ తన కవిత్వంతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన గొప్ప మానవతావాది గుర్రం జాషువా అన్నారు. గుర్రం జాషువా యొక్క కవిత్వం సంస్కృత పదాల అల్లిక, పొందిక అద్భుతంగా ఉంటాయని, ప్రజల యొక్క కష్టాలను మంచి వాక్యాలతో పరిపూర్ణమైన కవిత్వాన్ని రచించారని కొనియాడారు. చీత్కారానికి గురైన చోటే సన్మానం అందుకున్న మహాకవి గుర్రం జాషువా అని కొనియాడారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి గుర్రం జాషువా జీవితం, రచనలు గురించి గంగా ప్రవాహం లాగా ప్రసంగించి సభను చైతన్యం చేశారు. ఈ సభలో అధ్యాపకులు భీమన్న, లోకానాధ మందడి, వేంకటేశ్వర్లు, ప్రసాదరావు, తేజోవాణి, మునస్వామి ఆచారి, సురేష్, భాస్కర్ రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో... సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో గుర్రంజాషువా, భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. సీనియర్ నాయకులు రామిరెడ్డి మాట్లాడుతూ జాషువా సమాజంలోని సామాజిక రుగ్మతలను తన కలంతో ఎదుర్కొన్నారన్నారు. భగత్‌సింగ్ ఉరికంబాన్ని సైతం లెక్కచేయకుండా దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడపాల ప్రసాద్, సురేష్, మణి, రాజారావు పాల్గొన్నారు.


ఏర్పేడులో.. రాజులపాలెంలోని యువనేస్తం అసోసియేషన్ ఆఫీసులో అధ్యక్షులు మధురాంతకం మునిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఉద్యమకారుడు భగత్‌సింగ్ ఢిల్లీ వీధుల్లో ఎర్రకాగితాలు చల్లి ప్రజలను చైతన్యపరచిన విప్లవవీరుడని అన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అరాచకాలపై ప్రశ్నిస్తూ పోరాట పటిమను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునెమ్మ, అరుణ, వాణి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం : డివైఎఫ్ఐ

భగత్‌సింగ్ కలలుగన్న సమాజం కోసం ఉద్యమించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జయచంద్ర పిలుపునిచ్చారు. 116వ జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బైరాగిపట్టెడ ఎంజిఎం స్కూల్లో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. భగత్‌సింగ్ దేశం కోసం 23 ఏళ్ల వయస్సులోనే ఉరికొయ్యను ముద్దాడిన మహనీయుడని అన్నారు. చదువుకున్న ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం ఇవ్వడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సుమన్, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు చిన్నబాబు, నాయకులు సురేష్, రూప్‌చంద్, చిరణ్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నివాళి



పుస్తకావిష్కరణలో టిటిడి ఛైర్మన్

తెలుగు రాష్ట్రాల్లో కోటి భగవద్గీత పుస్తకాలు ముద్రణ : టిటిడి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో కోటిమంది విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను ముద్రించి పంపిణీ చేయనున్నట్లు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. తమిళనం, కన్నడ, హిందీలోనూ ముద్రించే ఆలోచనలో టిటిడి ఉందన్నారు. సనాతన హిందూ ధర్మ ప్రచారాన్ని మరింత పెద్దఎత్తున నిర్వహించడంలో భాగంగా భగవద్గీతను విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో రాయించి పుస్తకాలుగా ముద్రించి తెలుగు రాష్ట్రాల్లో కోటి మందికి పంపిణీ చేస్తామని తెలిపారు. చెన్నయ్ స్థానిక సలహా మండలి ఛైర్మన్‌గా గురువారం ఎజె శేఖర్‌రెడ్డి సమాచార కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆచార్య పురుషులు, హైందవ ధర్మ పెద్దల సూచనలతో రాబోయే రోజుల్లో పెద్దఎత్తున హైందవ ధర్మ ప్రచార కార్యాచరణకు దిగుతామని తెలిపారు. తమ ధర్మకర్తల మండలి తొలి సమావేశంలోనే రామకోటి తరహాలో గోవిందకోటి పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. 25ఏళ్లలోపు వయస్సున్న వారు గోవింద కోటి రాస్తే వారితో పాటు కుటుంబ సభ్యులకు బ్రేక్ దర్శనం కల్పించాలని బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. చెన్నయ్, కాట్పాడి మార్గాల నుంచి తిరుమలకు నడచి వచ్చే భక్తుల కోసం విడిది కేంద్రాలు నిర్మిస్తామన్నారు. భక్తుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ అటవీ శాఖ నుంచి అనుమతి లభిస్తే తిరుమల నడకదారి వెంబడి ఫెన్సింగ్ నిర్మించే ఏర్పాటు చేస్తామన్నారు. చెన్నయ్ స్థానిక సలహా మండలి ఛైర్మన్ ఎజె శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చెన్నయ్‌లోని శ్రీవారి ఆలయం, పరిసరాలు ప్రస్తుతం 5.5 గ్రౌండ్ల స్థలంలో ఉన్నాయన్నారు. ఆలయాన్ని 11 గ్రౌండ్ల స్థలంలో విస్తరిస్తామన్నారు. స్థలం కొనుగోలుకు ఇప్పటివరకూ 19 కోట్లు విరాళంగా వచ్చిందన్నారు. కన్యాకుమారి, తిరుచ్చి, మధురై, కోయంబత్తూరుల్లో శ్రీవారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామన్నారు. టీటీడీ బోర్డు సభ్యులు డాక్టర్ శంకర్, మాజీ బోర్డు సభ్యులు కుమార గురు ,డెప్యూటీ ఈవో విజయ కుమార్ పాల్గొన్నారు.

రూ.కోటి విరాళం

చెన్నై లోని శ్రీవారి ఆలయ విస్తరణకు అవసరమైన భూమి కొనుగోలు కోసం ట్రూ వ్యాల్యూ హోం సంస్థ తరపున వారి ప్రతినిధి రవిచంద్రన్ కోటి రూపాయల చెక్కును టీటీడీ ఛైర్మన్ కరుణాకర రెడ్డికి అందజేశారు.

'తిరుమల ది సెవెన్‌హిల్స్ ఆఫ్ సాల్వేషన్' పుస్తకావిష్కరణ

తిరుచానూరు : తిరుమల ది సెవెన్‌హిల్స్ ఆఫ్ సాల్వేషన్ పుస్తకాన్ని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. తిరుమల చరిత్ర, విశేషాలతో ఈ పుస్తకాన్ని ముద్రించారన్నారు. చెన్నయ్ స్థానిక సలహా మండలి ఛైర్మన్ శేఖర్‌రెడ్డి, ది హిందూ సిఇఒ నవనీత్, బిజినెస్ లైన్ ఎడిటర్ రఘువీర్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

సహస్ర గణపతికి 1008 లడ్డూలతో పూజ



ఏర్పేడు : మల్రిమంద గ్రామంలోని బీసీ కాలనీలో సహస్ర గణపతి ఆలయంలో 11 రోజుల పాటు దిగ్విజయంగా పూజ జరిపారు. చివరిరోజు 1008 లడ్డూలతో గణపతికి అభిషేకం, హోమం, ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మల్రిమంద ఎంపిటిసి నాగరాజు రెడ్డి, పాపానాయుడుపేట ఎంపిటిసి మునిరాజా, హేమాద్రి, త్రివిక్రమరావు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై సమరభేరి

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

పని ప్రదేశాలలో శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల సమస్యపై సమరభేరి మోగించాలని సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన శ్రామిక మహిళా సదస్సు నిర్ణయించింది. యస్. వాణిశ్రీ అధ్యక్షతన జరిగిన సదస్సులో 18 రంగాలకు చెందిన శ్రామిక మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. 2013 వ సంవత్సరంలో పని ప్రదేశంలో శ్రామిక మహిళలు లైంగిక వేధింపులను ఎదుర్కొంటుంటే తీసుకోవలసిన చర్యల గురించి చట్టం ఏర్పడిందని, ఆ చట్టం తిరుపతి జిల్లాలో అమలు కావడం లేదని వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఉన్నచోట అంతర్గత కమిటీలు ఉండాలని, అనేక చోట్ల ఇలాంటి కమిటీలు లేకపోవడం విచారకరమని వారు విమర్శించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయాల్సిన స్థానిక కమిటీ కూడా ఏర్పాటుకు నోచుకోలేదని విమర్శించారు.

రక్షణ భేరి ఏర్పాటు చేయాలని డిమాండ్



సదస్సులో మాట్లాడుతున్న వాణీశ్రీ

గతంలో టీటీడీ పరిపాలనా భవనంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సందర్భాన్ని ఉదహరించారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా ఉండాలంటే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కషి చేయాలన్నారు. 30వ తేదీ శనివారం శ్రామిక మహిళా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని కలిసి స్థానిక కమిటీ ఏర్పాటుకు విజ్ఞప్తి చేయాలని సదస్సు తీర్మానించింది. ఈ సదస్సులో ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు జయంతి, సాయిలక్ష్మి హాకర్స్ నాయకురాలు బుజ్జి, కస్తూరి (న్యాయవాది) మల్లెల వాణి జ(ర్నలిస్టు), డాక్టర్ శ్రావ్య, బిఎస్ ప్రసన్న (బ్యాంకు) జి. నాగమణి, ధనలక్ష్మి (ఆటో) ఏ. పద్మజ (ఉపాధ్యాయురాలు), జి. రేవతి (మున్సిపాలిటీ), కే. హేమలత (మెడికల్), పి. శశిరేఖ (రైల్వే), చంద్రమ్మ (అగ్రికల్చర్ కాలేజ్), పద్మలీల, హైమావతి, మంజుల, ముని కుమారి, నాగరాజమ్మ (అంగన్వాడి), సరిత (ఆర్పి), బేబీ రాణి (టిటిడి), త్రివేణి (వాలంటీర్) తదితరులు తమ తమ రంగాలలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను సవివరంగా వివరించారు. వీరికి మద్దతుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, కోశాధికారి కెఎస్ఎస్ ప్రసాదరావు, రమేష్, బాలాజీ, ఎం. రఘు, టి సుబ్రహ్మణ్యం, పి మునిరాజ, కే. వేణుగోపాల్, టి. మురళి, గంగులప్ప, పార్థసారథి పాల్గొన్నారు...

మానవహక్కులన్నీ మహిళా హక్కులే : డాక్టర్ హైమావతి

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

మహిళలు హక్కులు, చట్టాలను గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని శ్రీ పద్మావతి మహిళా అధ్యయన కేంద్రం పరిశోధకులు డాక్టర్ కె. హైమావతి పేర్కొన్నారు. మానవహక్కులన్నీ మహిళా హక్కులేనని ఉద్ఘాటించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో " మహిళలు -బాలికలపై హింస - భద్రత " అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఎస్వీ డబ్ల్యు డిగ్రీ, పిజి కాలేజీలో గురువారం విద్యార్థినులకు నిర్వహించారు. సమాజంలోని మహిళల పట్ల ఉన్న అసమానతను, వివక్షతలు, హింస రూపుమాపాల అంటే మహిళలకు చట్టాలపై అవగాహన చాలా అవసరం అన్నారు. ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్ ఏ విధంగా నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్.మహదేవమ్మ, సైకాలజీ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ భద్రమణి, ఉమరాణి పాల్గొన్నారు.

ఎస్వీయూలో 'పందుల పెంపకం'

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో విద్యార్థుల మధ్యనే పందులు సైతం యథేచ్ఛగా తిరుగులాడుతున్నాయంటే భద్రత డొల్లతనాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే విశ్వ విద్యాలయంలో బయటి వ్యక్తులు కారు, బైక్, స్కూటీ రేస్‌లు జరుపుతున్నారు. ఆడిటోరియంపై జంటలు జంటలుగా విందులు వినోదాలు నిర్వహిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.

వర్సిటీలో ఏ గేటు నుంచి ఏ బయట వ్యక్తి వస్తాడో, ఏ అఘాయిత్యం చేస్తాడో, ఏ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతాడో తెలియదు. దీనికితోడు ఇంజినీరింగ్ కళాశాల పరిధిలోని కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా పందులు స్వైర విహారం చేస్తుంటాయి. ఉదయం, సాయంత్రం హోటళ్లలో మిగిలిపోయిన అన్నం, ఇతర పదార్థాలను తీసుకొచ్చి అక్కడ వేయడంతో పందులు వీటి కోసం నిత్యం వస్తుంటాయి. ప్రకాష్‌నగర్‌లో వర్సిటీ సిబ్బంది నివసించే ప్రాంతంలోనూ పందులకు మేతగా చెత్తను తీసుకొచ్చి వేస్తుంటే అడిగే దిక్కులేదు. ఒకవేళ అడిగినా బెదిరింపులు తప్పవు. బోధన, బోధనేతర సిబ్బంది నివసించే క్వార్టర్స్‌వద్ద పందులు తిరుగుతూ కనిపిస్తాయి. ఇంజినీరింగ్ కళాశాల, ఎన్‌సిసి నగర్, ప్రకాష్‌నగర్ సమీపంలోనే కాకుండా బాలికల వసతిగృహం వన్ వెనుక ప్రాంతంలో, బాలికల వసతి గృహం టు పక్కన, ఇంజినీరింగ్ హాస్టల్స్ వెనుక, హెచ్‌బ్లాక్ ఎదురుగా, ఐ బ్లాక్ పక్కన, జి బ్లాక్ వెనుక ఇలా పలు ప్రాంతాల్లో పందులు తిరుగుతూనే ఉంటాయి. అనేకమార్లు విద్యార్థిసంగాల నేతలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా 'ఆ పందులా' అని నవ్వి వదిలేస్తున్నారు. పందుల వల్ల విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది. అయినా ఉన్నతాధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. ఓ వైపు కుక్కలు, పందులు, మరోవైపు చిరుతలతో సహవాసం చేస్తూనే విద్యార్థులు చదువులు లాక్కొస్తున్నారు.

భద్రత డొల్లతనంతో వెలుగులోకి...



ఇదే ఎస్వీయూ స్వచ్ఛభారత్

అటవీ అధికారులపై ప్రైవేటు ఫ్యాక్టరీ యాజమాన్యం దాడి

ప్రజాశక్తి- కే వి బి పురం

కే. వి. బి. పురం మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామ సమీపంలోని ప్రైవేటు ఫ్యాక్టరీకి సంబంధించిన యాజమాన్యం అటవీ సిబ్బందిపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఫ్యాక్టరీకి సంబంధించిన పాత భవనాల శిథిలాలను రిజర్వు ఫారెస్టులోకి తరలిస్తుండగా అటవీ అధికారులైన రాగిగుంట డిప్యూటీ రేంజి ఆఫీసర్ అడ్డుకున్నారు. దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యం మల్లికార్జునరెడ్డి, భక్తవత్సలరెడ్డి, వాసులు సిబ్బంది సాయంతో అటవీ అధికారులపై రాళ్లు రువ్వారు. ఎస్ఐ సునీల్‌కు ఫిర్యాదు చేసినట్లు ఫారెస్టు సిబ్బంది తెలిపారు.

అసైన్డ్ భూముల చట్టసవరణ ఉపసంహరించుకోవాలి

గూడూరు టౌన్ : అసైన్డ్ భూముల చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఈనెల 30న ఎఐకెఎంఎఎస్ ఆధ్వర్యంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ డిపి పోలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. గూడూరు రిటైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో జరిగే సదస్సుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, నాంచార్లు పాల్గొంటారని తెలిపారు.

పద్మావతి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

తిరుచానూరు : శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, అర్చకులు బాబుస్వామి, మణికంఠ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా వేదాశీర్వచనం, కుంకుమార్చన ఆర్జిత సేవలు

తిరుచానూరు : తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయంలో నూతనంగా వేదాశీర్వచనం, కుంకుమార్చన ఆర్జిత సేవలను టీటీడీ ప్రవేశపెట్టింది. వేదాశీర్వచనం సేవ ప్రతిరోజూ ఉంటుంది. రూ.500 చెల్లించి ఈ సేవాటికెట్ ను బుక్ చేసుకునే గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె బహుమానంగా అందజేస్తారు. శ్రీ పుండరీకవల్లి అమ్మవారికి ప్రతి శుక్రవారం కుంకుమార్చన సేవ నిర్వహిస్తారు. ఒక్కో సేవాటికెట్ కు రూ.250 చెల్లించి భక్తులు బుక్ చేసుకోవచ్చు.

రేపు 'జనహిత జనరిక్స్' ప్రారంభం

తిరుచానూరు : తిరుపతి మెడీ సెంటర్‌ను శనివారం నగర మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కమిషనర్ హరిత ప్రారంభించనున్నారు. 2012లో ప్రారంభమైన జనహిత సంస్థ ఇప్పటికి 11 ఏళ్లు పూర్తి చేసుకుంది. తిరుపతి, నెల్లూరు, చిత్తూరు, వెంకటగిరి, విజయవాడ తదితర ప్రాంతాల్లో 14 జనరిక్ స్టోర్స్ ద్వారా దాదాపు ఎనిమిది లక్షల మంది సామాన్యులకు తక్కువ ధరలో మందులు అందిస్తోంది. టిటిడి, సచివాలయం, మున్సిపల్ ఉద్యోగులకు ప్రత్యేక తగ్గింపును అందిస్తోంది.

భవ్యశ్రీ మృతిపై సమగ్ర విచారణ జరపాలి : వడ్లతాంగల్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం వేణుగోపాలపురానికి చెందిన మునిక్రిష్ణ, పద్మావతి దంపతుల కుమార్తె భవ్యశ్రీ మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి కోరారు. భవ్యశ్రీ మరణం వెనుక ఆమెను వేధించిన యువకుల హస్తం ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే ఈ ఘోరం జరిగి ఉండేది కాదని అబిప్రాయపడ్డారు. భవ్యశ్రీ మరణానికి కారకులు ఎంతటి వారైనా చట్టపరంగా శిక్షించాలని డిమాండు చేశారు. భవ్యశ్రీ మరణంపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

నేడు 3కే రన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం 3కే రన్ నిర్వహిస్తున్నట్లు ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ గురువారం ఓ ప్రకటన లో తెలిపారు. స్థానిక ఎంజీఎం ఆసుపత్రి నుంచి బసవయ్య చెక్ పోస్టు వరకు 3కే రన్ ఉంటుందనీ, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి జెండా ఊపి ప్రారంభిస్తారని చెప్పారు. పెద్ద సంఖ్యలో ప్రజల పాల్గొని హృదయాన్ని పదిలంగా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ఎస్ఎంఎస్‌జి గృహశక్తిని విస్తరింప చేస్తాం: దీపక్ పాట్కర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ



గృహరుణ కంపెనీలలో ఒకటైన ఎస్ఎంఎస్‌జి గృహశక్తి మొదటి శాఖతో ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరింప చేసిందని ఆ సంస్థ ఎండి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దీపక్ పాట్కర్ తెలిపారు. గతంలో ఫుల్లర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీగా గుర్తింపు పొందిన ఎస్ ఎంఎస్ జి గృహశక్తి బలమైన పేరెంటేజ్ తో దేశవ్యాప్తంగా డిస్ట్రిబ్యూషన్ కలిగి ఉందన్నారు. గృహ అభివృద్ధి , గృహ నిర్మాణం , గృహ విస్తరణ తో పాటుగా, తనఖా రుణాలు, మధ్య స్థాయి డెవలపర్‌లకు, కొత్త, పున్రవిక్రయం, వాణిజ్య ఆస్తి, వాణిజ్య ప్లాట్లు, నిర్మాణ ఫైనాన్స్ కోసం రుణాలు అందిస్తుందన్నారు.

కాలినడక భక్తులకు అన్నదానం

పుత్తూరు టౌన్ : గొల్లపల్లి రోడ్డులో తిరుమలకు కాలినడకన వచ్చే భక్తులకు రామకృష్ణాపురం పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు దేవేందర్‌రెడ్డి సౌజన్యంతో గురువారం అన్నదానం చేశారు. తన తండ్రి సర్పంచిగా ఉన్నప్పటి నుంచి ఆనవాయితీగా భక్తులకు అన్నదానం చేస్తున్నామన్నారు.

కౌన్సిల్ చైర్మన్ కొయ్య మోహన్ రాజుతో ఎమ్మెల్సీలు

కోట : అసెంబ్లీ సమావేశాలు చివరి రోజున బుధవారం కౌన్సిల్ చైర్మన్ కొయ్య మోహన్ రాజుతో ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, మేరిగ మురళి ధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాసన మండలి సమావేశాలపై చర్చించారు. వారితో పాటు వైసీపీ నాయకులు వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, చెందోడు పంచాయతీ వైసీపీ యువ నాయకులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి ఉన్నారు.

వెంకటరమణ'లో 'గుండె' పదిలం

నేడు వరల్డ్ హార్ట్ డే





ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

గుండెజబ్బులకు 'వెంకటరమణ హార్ట్ అండ్ గైనకాలజీ' సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో అత్యాధునిక సౌకర్యాలను అందిస్తున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ వెంకటరమణ, నిరుపమ తెలిపారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో వారు గుండె సమస్యలపై, వాటి పరిష్కారాలు, జాగ్రత్తలను వివరించారు. ఈ రోజుల్లో చిన్న వయసులోనూ గుండె సమస్యలు తలెత్తి యుక్త వయసులోనే ప్రాణాలు పోతున్న పరిస్థితులు యువ భారతానికి ఓ కలవర పెట్టే అంశమేనన్నారు. మారుతున్న కాలానుగుణంగా ఆహారపు అలవాట్లు, ధూమపానం, అధిక బరువు, కొలెస్ట్రాల్ శాతం ఎక్కువ, మానసిక ఒత్తిడి కారణంగా గుండెపై తీవ్ర ప్రభావం చూపుతూ గుండె సంబంధిత వ్యాధులకు గురై ప్రాణాలు పోయే పరిస్థితులు నేడు ఏర్పడ్డాయన్నారు. 2000 సంవత్సరం నుండి 2016 సంవత్సరం వరకు పరిశీలిస్తే గుండెకు సంబంధించిన వ్యాధిగ్రస్తులు ప్రతి ఏటా రెండు శాతం పెరుగుతూనే వస్తూ ఉన్నారని అధ్యయనాల్లో తేలిందన్నారు. ప్రస్తుత తరుణంలో ఎవరైనా సరైన జాగ్రత్తలు తీసుకోకుండా 40 ఏళ్లు దాటిన వారు చాలా అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. గుండె ఆరోగ్యాన్ని పెంచే వ్యాయామాలు, నడక, యోగ చాలా ఉపకరిస్తాయని, ఆ దిశగా ప్రజలు తమ గుండె ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి వైద్యులు సూచించే తగిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. తిరుపతి నగరంలో గత 25 సంవత్సరాలుగా గుండె సంబంధించిన వ్యాధులకు వెంకటరమణ హాస్పిటల్ అధునాతన వైద్య చికిత్సలను అందిస్తోందని తెలిపారు. ఇప్పటివరకు వందలాది కేసుల్లో అధునాతన నూతన టెక్నాలజీని వినియోగిస్తూ 98 శాతం గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు విజయవంతంగా చికిత్సను అందించి ప్రాణాలు కాపాడగలిగామన్నారు. పలు అధ్యయనాల తర్వాత రాబోయే రోజుల్లో గుండె సంబంధిత వ్యాధిగ్రస్తుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని, మానవ శరీరంలో అత్యంత కీలకమైన గుండె ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి మానసిక ఒత్తిడి తగ్గించుకోవడం, అధిక బరువును తగ్గించుకోవడం, బ్యాడ్ కొలెస్ట్రాల్ శాతాన్ని తగ్గించుకోవడం, నడక, యోగ వంటి వాటిని మన రోజువారి కార్యాచరణలో భాగం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వెంకటరమణ హాస్పిటల్లో కార్డియాలజీ, కార్డియోథొరాసి-గైనికాలజీ అండ్ ఓబిసిటీస్ - జనరల్ సర్జరీ-జనరల్ మెడిసిన్ 24 గంటలు ఎమర్జన్సీ వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు.

జిల్లాకు చేరిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు



ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట వద్ద గల వేర్ హౌసింగ్ కార్పొరేషన్ కాంపౌండ్‌లో గల ఈవిఎం గోడౌన్‌ను, గోడౌన్ కు చేరుకున్న బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లను గురువారం ఉదయం కలెక్టర్ కె వెంకటరమణా రెడ్డి, ఎస్డిసి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మీడియాకు వివరిస్తూ కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఓటరు నమోదు అధికారి ఆదేశాల మేరకు బెంగుళూరు బెల్ కంపెనీ నుండి 6780 బ్యాలెట్ యూనిట్లు, 4270 కంట్రోల్ యూనిట్లు సెంట్రల్ వేర్ హౌసింగ్ గిడ్డంగి కి చేరుకున్నాయని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ ను తెరిచి, వాటిని గోడౌన్ లో భద్ర పరచడం జరిగిందనీ అన్నారు. తొందరలో బెల్ కంపెనీ ప్రతినిధులు వచ్చి స్కాన్ చేసి వివరాలు అప్లోడ్ చేస్తారని, వచ్చే నెల ఎన్నికల కమిషన్ తెలిపే తేదీ మేరకు గోడౌన్ లోని ఈ వి ఎం ల పనితీరును మొదటి దఫా చెక్ చేస్తామన్నారు. సక్రమంగా పని చేసే వాటిని ఉంచుకుని, సరిగా లేని వాటిని కంపెనీ కి వెనక్కు పంపడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ భద్రతా ప్రమాణాల మేరకు 24/7 పోలీస్ భద్రత, సి సి కెమరాల పర్యవేక్షణ , విజిటింగ్ రిజిస్టర్ వంటి తదితరాలు ఏర్పాటు చేసామని అన్నారు. అనంతరం గిడ్డంగి ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ లో భాగంగా కలెక్టర్ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రతినిధి ప్రభాకర్, సిడబ్ల్యూసి మేనేజర్ రమేష్ బాబు, ఎన్నికల తహసిల్దార్ సురేష్, రేణిగుంట ఉప తహసిల్దార్ ప్రేమ్ పాల్గొన్నారు.

మామిడి తోటల్లో సస్యరక్షణ అవసరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు వాటికి అవసరమైన పోషకాలను అందిస్తే పంట దిగుబడి అధికంగా ఉంటుందని స్పిక్ అండ్ గ్రీన్ స్టార్ ఫెర్టిలైజర్స్ ఎగ్జిక్యూటివ్ మార్కెటింగ్ డెవలప్మెంట్ అధికారి తిరుమల రావు పేర్కొన్నారు. శుక్రవారం నేసనూరు గ్రామంలో మామిడి తోట రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి తోటలో సస్యరక్షణ చర్యల్లో భాగంగా కొమ్మల కత్తిరింపు, ఎండుకొమ్మలను తొలగించడం వంటివి ప్రధాన పాత్ర అని తెలిపారు. అలాగే మామిడి తోటల్లో అంతర్గతంగా చెట్లకు సరైన ఎరువులు అందిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చు అని ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే స్పిక్ గ్రీన్ స్టార్ కంపెనీవారు అందిస్తున్న పలు రకాల రసాయన ఎరువుల గురించి రైతులకు ప్రదర్శనగా చూపించి వివరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ మార్కెటింగ్ డెవలప్మెంట్ ఆఫీసర్లు ముబారక్, సాయి కష్ణ సుమారు 70 మంది రైతులు పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయ్ : టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/ వెంకటగిరి

అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాలను అక్రమ కేసులతో వేధిస్తున్న జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, జనసేన ఇంచార్జి కోటా వినుత అన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవనం వద్ద గురువారం జరిగిన టీడీపీ బీసీ విభాగం నాయకుల రిలే నిరాహార దీక్షకు సుధీర్ రెడ్డి, వినుత సంఘీభావం తెలియజేశారు. గాలి చలపతి నాయుడు, ఎస్సీవీ దిలీప్ నాయుడు, చెంచయ్యనాయుడు, చక్రాల ఉషా, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అక్రమ అరెస్టుకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దీక్షలో పాల్గొన్నారు. గురువారం త్రిభువని సెంటరులో దీక్షా శిభిరంలో పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక నియంత, సైకోలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఈకార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద్, మాజీ మార్కెటింగ్ చైర్మన్లు, యాతలూరు మాజీ సర్పంచ్ బర్రి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో అభివద్ధి శూన్యం : పులివర్తి నాని

యర్రావారిపాలెం : చంద్రగిరి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పులివర్తి నాని గురువారం మండలంలో టిడిపి జనసేన మండల నాయకులతో ఉమ్మడి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులివర్తి నాని మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణా అవినీతి అక్రమాలు తప్ప అభివద్ధి ఎక్కడ జరగలేదని దుయ్యపట్టారు.



వర్షం వస్తే సంతలో 'చింత'

ప్రజాశక్తి - ఏర్పేడు

మండల కేంద్రమైన ఏర్పేడులో ప్రతి గురువారం సంత జరుగుతుంది. అయితే వర్షం వచ్చిందంటే చాలు వ్యాపారుల బాధ వర్ణనాతీతం. నిత్యవసర వస్తువులు, కూరగాయలను బహిరంగ ప్రదేశంలోనే వీరు పెట్టుకుని అమ్ముకుంటారు. వర్షం వస్తే అతి తక్కువ ధరకే వినియోగదారులకు అమ్మేసి వెళ్లిపోవాల్సి ఉంటుంది. కనీస గిట్టుబాటు ధర ఉండటం లేదని చిరు వ్యాపారులు వాపోతున్నారు. ఎక్కువమంది వ్యాపారులు తెచ్చిన సరుకును అలానే ఇళ్లకు మోసుకెళ్లారు. సంతలో చిరువ్యాపారులకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక షెడ్లు నిర్మించాలని వారు కోరుతున్నారు. వర్షానికి తడిస్తే వస్తువులు పనికిరాకుండా పోతాయని, వ్యాపారం పూర్తిగా దెబ్బతింటుందని వారు వాపోతున్నారు.

వేడుకగా అనంత పద్మనాభ వ్రతం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

తిరుమలలో గురువారం అనంతపద్మనాభ వ్రతం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుండి ఊరేగింపుగా శ్రీ భూవరాహస్వామి ఆలయం వద్దనున్న స్వామివారి పుష్కరిణి చెంతకు వేంచేపు చేశారు. అక్కడ చక్రత్తాళ్వార్లకు అభిషేకాదులు నిర్వహించిన అనంతరం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ప్రతి సంవత్సరం బాధ్రపదమాస శుక్ల చతుర్దశి పర్వదినాన అనంతపద్మనాభస్వామి వ్రతం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

సుప్రభాత సేవలో గౌతంగంభీర్

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

టీమిండియా మాజీ ఓపెనర్, బీజేపీ ఎంపీ గౌతం గంభీర్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.. బుధవారం విఐపి దర్శనం సమయాల్లో ఈ దంపతులు శ్రీవారిని దర్శించుకున్నారు..కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సేవలో గంభీర్ పాల్గొన్నాడు. టీటీడీ అధికారులు గంభీర్ దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా గంభీర్ మాట్లాడుతూ..వన్డే ప్రపంచకప్-2023 టైటిల్ను సొంతం చేసుకునేందుకు భారత జట్టుకు మంచి అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. 140 కోట్ల మంది భారతీయుల ప్రార్థనలతో టీమిండియా కచ్చితంగా వరల్డ్ కప్ గెలుస్తుందని గంభీర్ ఆశాభావం వ్యక్తం చేసారు.



చైతన్యపురంలో ఉచిత పశు వైద్యశిబిరం

రేణిగుంట : మండలంలోని కరకంబాడి పంచాయతీ చైతన్యపురంలో జరిగిన రాస్ ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గురువారం రాష్ట్రీయ సేవాసమతి పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు ఆదేశానుసారం రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ద్వారా మండలంలోని చైతన్యపురం గ్రామంలోని రైతులకు సంబంధించిన అన్ని పశువులకు, జీవాలకు రేణిగుంట ఏరియా వెటర్నరీ డాక్టర్ స్రవంతి, కె వి కె వెటర్నరీ డాక్టర్ అనూష వారి బంద సహకారంతో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు.కడుపులో ఉండే పురుగులకు సంబంధించి, పిడుదులకు సంబంధించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెవికె సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డాక్టర్ శ్రీనివాసులు, రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్ పాల్గొన్నారు

వైజెపి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుని మృతి తీరని లోటు

గూడూరు టౌన్ : వైజెపి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు సురా బత్తిన సుబ్రమణ్యం మృతి తీరని లోటని సభ్యులు పేర్కొన్నారు. అనంతరం ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు స్వామి, జోన్ చైర్మన్ ఎంజెఫ్ గురునాధం పాల్గొన్నారు.

ర్యాబిస్ వ్యాధిపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి -దొరవారిసత్రం

జంతు జాతిలోని కుక్క కాటు ద్వారా మానవజాతికి సంభవించే ర్యాబిస్ వ్యాధిపై అవగాహన కల్పిద్దామని దొరవారి సత్రం పిహెచ్‌సి ఆరోగ్య సిబ్బంది తీర్మానించారు. గురువారం ప్రపంచ రాబిస్ డే సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కుక్క కాటు అందరికీ ప్రాణాంతకం కాదని, చికిత్స పొందితే నయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్స్ మైథిలి, గోపి కిరణ్, ఎం ఎల్ హెచ్ పి లు శివ గాయత్రి, పావని పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుపతి డెస్క్ : తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం వీఐపీ విరామ సమయంలో సెంట్రల్ మినిస్టర్ ఎల్.మురుగన్, హీరో అశ్విన్ బాబు వేరువేరుగా దర్శించుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, టీటీడీ అధికారులు తీర్థ ప్రసాదాల అందించారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం విజయభేరి

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

జాతీయ స్థాయిలో 2023-2024 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ పరీక్ష ఫలితాల్లో తిరుపతి విశ్వం విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యధిక సీట్లు సాధించారు. మొదటి జాబితా ఫలితాల్లో 42 మంది 2వ జాబితా ఫలితాల్లో ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ యన్.విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ యన్. విశ్వ చందన్ రెడ్డి, కరస్పాండెంట్ యన్. తులసీ విశ్వనాథ్ అభినందించారు.

క్రైం న్యూస్

లారీని ఢీకొన్న కారు : డ్రైవర్‌కు గాయాలు

పుత్తూరు టౌన్ : పుత్తూరు చెన్నై జాతీయ రహదారిపై నారాయణవనం రోడ్డు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. తమిళనాడుకు చెందిన నవీన్ కుమార్ అనే అతను ఓనర్. మహావీర్, నిషా, టయోటా కారు లో తిరుమలకు వెళు తుండగా సత్యవేడు నుండి పుత్తూరు వైపు వస్తున్న లారీ డ్రైవర్ శివమూర్తి ఫ్లై ఓవర్ లోపల నుండి అజాగ్రత్తగా వచ్చి కారును ఢీ కొనడంతో కారు డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు దగ్గర స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయడంతో యాక్సిడెంట్ తగ్గించవచ్చని స్థానికులు చెబుతున్నారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురిని చికిత్స నిమిత్తం చెన్నైకి పంపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండో ఘాట్‌లో కొండను ఢీకొన్న బస్సు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

తిరుమల రెండవ ఘాట్ రోడ్డులో గురువారం ఉదయం కొండను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ కు గాయాలయ్యాయి. పలువురు భక్తులు, టిటిడి ఉద్యోగులు స్వల్పగాయలతో బయటపడ్డారు. గంటపాటు ట్రాఫికి అంతరాయం కావడంతో ట్రాఫిక్ పోలీసులు వచ్చి వాహన రాకపోకలను క్రమబద్ధీకరణ చేశారు.

10.5 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- నాయుడుపేట



ఓజిలి క్రాస్ రోడ్డు వద్ద గురువారం ఉదయం వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా 10.5 కేజీల గంజాయి పట్టుబడింది. దీని విలువ లక్షన్నర పైనే ఉంటుంది. విజయవాడ నుంచి బెంగుళూరుకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్ బస్సులో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి శోదా చేయగా వారి నుంచి గంజాయి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. ముద్దాయిలు ఎన్.చేతన్, ఎం.సైఫుల్లా కర్నాటకకు చెందిన వారిగా గుర్తించారు. విశాఖపట్నంలో గంజాయి కొనుగోలు చేసి బెంగుళూరుకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. గంజాయిపై ఉక్కుపాదం మోపి 260 గంజాయి కేసుల్లో 732 మంది నేరస్తులను అరెస్టు చేసి 3,604 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ ఇన్‌స్పెక్టర్లు ఆర్‌యువిఎస్ ప్రసాద్, ఎస్ఐ ఒ.ప్రతాప్‌కుమార్, సిబ్బంది డి.వెంకటేశ్వర్లు, ఎ.శ్రీరాములు, పి.వెంకటేశ్వర్లు ఉన్నారు. వీరిని ఎస్పి పి.పరమేశ్వర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ఈద్ మిలాద్ ఉన్ నబీ'

చిన్నగొట్టిగల్లు: మండలంలోని ముస్లింలు మహమ్మద్ ప్రవక్త జన్మదినం 'ఈద్ మిలాద్ ఉన్ నబీ' పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎస్.షాజహాన్, గౌసియా, మస్జిద్ ముత్తువల్లి, ఆరీఫ్ ఖాన్, సత్తార్ ఖాన్, కదీర్, షబ్బీర్ లు మాట్లాడుతూ. ప్రవక్త జీవితం మానవాళికి ప్రేమ, సోదరభావం, ధర్మంపై స్ఫూర్తి కలిగిస్తోందన్నారు. తోటివారికి విశ్వాసం, నమ్మకం, సంరక్షణ, కరుణతో సేవ చేసినప్పుడే ప్రవక్త లక్ష్యం నెరవేరుతుందన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

'గూడూరు రూరల్ : గూడూరు షాదీ మంజిల్ నందు మొహ్మదీయన్ వెల్ఫేర్ నెట్వర్క్ ఆధ్వర్యంలో ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రీజనల్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ ఆదినారాయణ రావు చేతుల మీదుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 90 మంది విద్యార్థులకు రెండు జతల దుస్తులను పంపిణీ చేశారు. దర్గా కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు గఫూర్ అబ్దుల్ రహీం పఠాన్ అజీజ్ ఖాన్ కాలేషా పాల్గొన్నారు.

పేదలకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ

గూడూరు రూరల్ : మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు మిలాద్ - ఉన్ -నబి సందర్భంగా గూడూరు లోని బాలాజీ నగర్ సెంటర్ వద్ద బి.బి నాంచారమ్మ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంకణాల పెంచల్ నాయుడు పేదలకు బిరియాని పంపిణీ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త చూపించిన మంచి మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని అందరూ సోదర భావంతో కలిసి ఉండాలని సూచించారు.



IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : SRIKALAHASTI
E.P. NO. 58 / 2022, O.S.NO.46/2021

Between :
Kanupuru Gopi ...... Decree Holder
And
1. Veerasiddigari Raghu Prasad Reddy
2. Veerasiddigari Swathi .....Judgement debtors

Notice to J.D is 1 & 2

ఇందుమూలముగాపైకనిన జడ్జిమెంటు డెటార్‌లను తెలియజేయడం ఏమనగా మీ పై కనుపూరు గోపి వేసిన పై నంబరు కలిగిన E.P నందు మీరు కోర్టు నోటీసులు తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీకు పేపరు ద్వారా కోర్టు నోటీసును పంపుచున్నాము. సదరు పై నంబరు కలిగిన E.P తేది.11-10-2023వ తేదిన వాయిదా వున్నది. కావున మీరు వ్యక్తిగతంగా గానీ లేదా వకీలు ద్వారా గాని పైతేదిన కోర్టుకు హాజరు అయి మీ యొక్క అభ్యంతరము తెలుపవచ్చును. లేనిచో మీ పరోక్షమున తీర్పుచేసి, మీ పై రూ.22,48, 215/- రికవరీ చేయుదురు లేనిచో మిమ్ము వారెంటు ద్వారా సివిల్ జైల్‌కు పంపుతారు.

ఇట్లు,
A. MUNI PRASAD, B.A., B.L.,
ADVOCATE FOR D.Hr

In the Court of the I Addl. Junior Civil Judge : Nellore
O.S.No. 833 / 2021

UCO Bank, rep.by its Branch Manager, Brindavanam, Nellore City - Plaintiff
Vs
1. **Budigi Dhanalakshmi** and another - Defendants

Notice

To,
D1. **Budigi Dhanalakshmi,** W/o **B. Sreenivasulu,** Residing at D.No.5-1/16, Garidi Veedhi, Naidupet, SPSR Nellore District.
D2. **Budigi Srinivasulu,** S/o **Radha Krishnaiah,** Residing at D.No.5-1/16, Garidi Veedhi, Naidupet, SPSR Nellore District.

పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే16-10-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

Sk. Yasdani, B.Com., L.L.B.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.